సాక్షి అనంతపురం

ఆదివారం । 16 । జూన్ । 2024



చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33 వేలు పలికాయి.



కొనసాగుతున్న విధ్వంసం

టీడీపీ నాయకుల దుశ్చర్యలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని పలు చోట్ల శనివారం కూడా రెచ్చిపోయారు.

8లో

గరిష్టం/కనిష్టం
36.2°/ 23.8°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

'బక్రీద్'కు ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్, చిత్రంలో ఎస్పీ గౌతమిశాలి

అనంతపురం అర్బన్: బక్రీద్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జిల్లా ఎస్పీ గౌతమి శాలి అన్నారు. ఈనెల 17న బక్రీద్ పండుగను పురస్కరించుకుని చేపట్టాల్సిన ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్రీద్ మత సామరస్యానికి ప్రతీక అన్నారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈద్గా మైదానాలు శుభ్రం చేయించాలన్నారు. నీటి ట్యాంకర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు వస్తారని, ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని జంతు వధశాలల్లో నీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ రాణిసుస్మిత, డీపీఓ ప్రభాకర్‌రావు, ప్రజారోగ్యశాఖ ఈఈ సతీష్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

18న కేవీకేలో సదస్సు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఈ నెల 18న రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు కేవీకే కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' నిధుల విడుదల సందర్భంగా వారణాసిలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే కార్యక్రమాన్ని రైతులు వీక్షించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థినుల ప్రగతిపై శ్రద్ధ



కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ నిదియాదేవి

పామిడి: విద్యార్థినుల ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జెడ్పీ సీఈఓ, ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ వైఖోమ్ నిదియాదేవి అన్నారు. శనివారం ఆమె స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్ రికార్డులను పరిశీలించారు. విద్యాబోధన, మెనూలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా? తదితర అంశాలపై విద్యార్థినులతో ఆరా తీశారు. అనంతరం స్కూల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులకు మంచాలు ఏర్పాటు చేయాలని ఎస్‌ఓ సౌభాగ్యలక్ష్మిని ఆదేశించారు. అంతకుముందు స్థానిక టీసీ హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక భవిత కేంద్రం తనిఖీ చేసి, విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు చేసిన కళాఖండాలను చూసి ఆశ్చర్యపోయారు. వాటికి ఒక బ్రాండ్ రూపొందించి అమ్మకానికి ఉంచడం ద్వారా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ఆమె వెంట ఎంఈఓ జయానాయక్, హెచ్‌ఎం రామ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

- వర్షాకాలంలో పెరుగుతున్న పాము కాట్లు
- గత 12 నెలల్లో 20 మందికి పైగా మృతి
- జాగ్రత్తలు పాటిస్తే మేలంటున్న వైద్యులు
- ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో మందులు

కాటేస్తున్న విష సర్పాలు





దేవన్న (ఫైల్)

- బొమ్మనహాళ్ మండలం ఉప్పరహాల్‌కు చెందిన తెలుగు దేవన్న (55)కు భార్య చిత్తమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్న ఆయన ఈ నెల 5న తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు కాలు పెట్టగానే పాము కాటేసింది. కుటుంబసభ్యులు వెంటనే కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారిలోని విమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

రాయదుర్గం: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో ఖాళీ జాగాల్లో గడ్డి బాగా పెరిగింది. ఈ క్రమంలో పాముల సంచారం అధికమై పాము కాట్లకు గురయ్యే వారి సంఖ్య పెరుగుతోంది. గడ్డి పొదలు, పొలం గట్లను స్థావరంగా చేసుకుని పొంచి ఉన్న పాములు రైతులు, రైతు కూలీలను కాటేస్తున్నాయి. గట్టు వెంబడి నడిచి వెళుతున్న వారు, పొలం దుక్కి పనుల్లో నిమగ్నమైనప్పుడు, రాత్రిళ్లు పొలం వద్ద కాపలాకు వెళ్లిన సమయంలో, పంట తొలగింపు సమయంలో, గడ్డి కోత సందర్భాల్లో పాము కాట్లు ఎక్కువగా ఉంటున్నాయి. జిల్లాలో గతేడాది జూన్ నుంచి ఇప్పటి వరకూ 20 మందికి పైగా పాము కాటుతో మృతి చెందినట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. అనధికారికంగా ఈ లెక్క రెట్టింపులో ఉంటుందని అంచనా.

పాములన్నీ ప్రమాదం కావు!

పాముల్లో చాలావాటికి విషం ఉండదు. 50 శాతం విషం లేని, ప్రమాదంలేని మామూలు పాములే. వీటి కాటుకు సాధారణ చికిత్స తీసుకుంటే సరిపోతుంది. త్రాచు, కట్లపాము వంటి 15 శాతం సర్పాలతోనే ప్రమాదముంటుంది. పాము విషం కన్నా చాలా మంది పాము కరిచిందనే భయంతోనే చనిపోతున్నారు. ఇంట్లోని వారు, ఇరుగూపొరుగు ధైర్యం చెప్పడానికి బదులు ఏడుపులు ప్రారంభిస్తుండడంతో పాము కాటుకు గురైన వ్యక్తి మరింత ఆందోళనకు గురై పరిస్థితి చేజారుతోంది.

పాము కరవగానే..

- భయాందోళనలకు గురికాకూడదు. భయం వల్ల రక్త ప్రసరణ పెరిగి విషం త్వరగా వ్యాపించే ప్రమాదముంది.
- పక్కనున్నవారు ఆ పాము విషసర్పమో కాదో గుర్తించే ప్రయత్నం చేయాలి. దానివల్ల చికిత్స మరింత కచ్చితంగా అందుకునేందుకు మార్గం ఏర్పడుతుంది.
- నాటు వైద్యం, మంత్ర తంత్రాలంటూ ఆలస్యం చేయరాదు. సాధ్యమైనంత తొందరగా దగ్గరలోని ఆస్పత్రికి పాము కాటు బాధితుడిని తరలించి చికిత్స అందజేయాలి. బాధితుడిని నడిపించరాదు. ఆటో, అంబులెన్స్, స్కూటర్ కనీసం మంచం సాయంతోనైనా ఆస్పత్రికి తరలించాలి.
- పాము కాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింత కోస్తే రక్తంతోపాటు విషం బయటకు వస్తుందని గాటు పెడతారు. ఇలా చేయడం చాలా ప్రమాదకరం. ఒక్కోసారి పాము కాటు కన్నా ఈ గాయం ప్రమాదకరంగా మారుతుంది.
- మరికొందరు గాటుపెట్టి నోటితో విషం పీల్చేస్తామంటారు. పాము కాటు వేయగానే విషం రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు, గుండెకు చేరుకుంటుంది. కాబట్టి దీనివల్ల ప్రయోజనం ఉండదు.



పాము విష విరుగుడు సూది మందు

జాగ్రత్తలు పాటించాలి

- రాత్రిళ్లు పొలాల్లోకి వెళ్లే రైతులు మోకాలి వరకు రక్షణ కల్పించేలా ఉన్న బూట్లు ధరించాలి.
- టార్చిలైట్లు లేదా లాంతరు తప్పక వెంట తీసుకెళ్లాలి.
- చేతిలో ఉన్న కర్రకు గజ్జెలు కట్టి గట్టుపై కొడుతూ వెళ్లాలి.
- బురద మడుల్లో పనిచేసే వారు రంధ్రాలు పూడ్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.
- ఆరుబయలులో రాత్రిళ్లు కింద కాకుండా మంచం, ఎత్తయిన బండపై పడుకోవాలి

నాటువైద్యం మంచిది కాదు



పాము ఏదైనా సరే విషం విరుగుడుకు సూది మందు త్వరగా పనిచేస్తుంది. పాము కరిచిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించాలి. నాటు వైద్యం అంటూ ఆలస్యం చేస్తే పరిస్థితి చేజారి పోవచ్చు. ఇది మంచిది కాదు. జిల్లా వ్యాప్తంగా అన్నీ పీహెచ్‌సీల్లోనూ సరిపడేంతా పాము కాటు మందులు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ సుజాత, వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి, అనంతపురం

సకాలంలో ఆస్పత్రికి తేవాలి



90 శాతం పాములు తక్కువ విషం కలిగి ఉంటాయి. నాగుపాము, కట్లపాము లాంటి 10 శాతం పాములు ప్రాణాంతకమైనవి. విష సర్పం కాటు వేయగానే నరాల మీద ప్రభావం చూపి ఊపిరి పీల్చుకునేందుకు ఇబ్బందిగా మారుతుంది. సకాలంలో ఆస్పత్రికి చేరిస్తే ప్రాణాపాయం తప్పించవచ్చు.

– డాక్టర్ మాధవి, మెడికల్ సూపరింటెండెంట్, రాయదుర్గం

టీబీ డ్యాంలో 6 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్: జిల్లా ప్రజలకు హెచ్చెల్సీ (ఎగువ) కాలువ ద్వారా తాగు, సాగు నీరందించే కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం జలాశయంలో 6.024 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మే నెలాఖరు వరకు డ్యాంకు ఇన్‌ఫ్లో లేదు. కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండేది. అయితే గత కొన్ని రోజులుగా డ్యాం ఎగువ భాగంలోని శివమొగ్గ, ఆగుంబే, తీర్థనహళ్లి, వరనాడు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లో పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 1,676 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. అవుట్‌ఫ్లో 301 క్యూసెక్కులుగా నమోదవుతోంది. ప్రసుత్తం జలాశయంలో 1,582.89 అడుగులకు నీరు చేరుకుంది. మొత్తం సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.024 టీఎంసీల నీరు ఉంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 1,581 అడుగుల వద్ద 4.975 టీఎంసీల నీరు నిల్వ ఉండిందని వెల్లడించారు.

ఎస్పీ బక్రీద్ శుభాకాంక్షలు

అనంతపురం: త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్పీ గౌతమి శాలి ఆకాంక్షించారు. జిల్లాలోని ముస్లింలకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్‌ను పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. ప్రధాన మసీదులు, మదరసాలు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని సున్నిత ప్రదేశాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. బీట్లు, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. అన్ని మతాల వారితో సమావేశాలు నిర్వహించి, ఒకరి మనోభావాలు మరొకరు గౌరవించేలా చూడాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఏవైనా అభ్యంతరకరమైన పోస్టులు షేర్ చేస్తే చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

18, 19 తేదీల్లో కేంద్ర బృందం పర్యటన



కేంద్ర బృందం పర్యటనపై చర్చిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: గత రబీలో నెలకొన్న కరువు పరిస్థితులను తెలుసుకునే నిమిత్తం కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటర్ మినిస్టీరియల్ టీం ఈనెల 18,19 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తారని వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఏడీఏ ఎం.రవి, టెక్నికల్ ఏఓ బాలానాయక్ తదితరులతో శనివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సమీక్షించారు. బృంద సభ్యుల వివరాలు, వారికి బస ఏర్పాట్లు, దెబ్బతిన్న పంటలు, తాగునీరు, సాగునీరు సమస్యలకు సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్, పప్పుశనగ సాగు చేసిన పంట పొలాలు, రైతులతో ముఖాముఖి, ఇతర అనుబంధ శాఖల అధికారులతో సమన్వయం, రూట్‌మ్యాప్ తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తామని తెలిపారు. గత రబీలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పప్పుశనగ విస్తీర్ణం తగ్గిందని, అలాగే పంట దిగుబడులు కూడా తగ్గిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం 14 మండలాలను కరువు జాబితాలో చేర్చిందన్నారు. ప్రకృతి విపత్తుల విభాగం నిబంధనల మేరకు బెళుగుప్ప, బొమ్మనహాళ్, డీ.హీరేహాళ్, గుత్తి, గుంతకల్లు, కణేకల్లు, పెద్దపప్పూరు, పుట్లూరు, తాడిపత్రి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, యాడికి, యల్లనూరు మండలాల్లో పంట నష్టం అంచనాలు తయారు చేశామన్నారు. మొత్తంగా 37,195 హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో రూ.36.86 కోట్లకు పైగా నష్టం జరిగిందన్నారు. అందుకు సంబంధించి నివేదికను కేంద్ర బృందానికి అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

19 నుంచి ఐటీఐ అడ్మిషన్ల కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 19 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మెరిట్ ఆధారంగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. పదో తరగతి మార్కుల జాబితా, టీసీ, స్టడీ, కుల ధ్రువీకరణ, ఫొటో, ఆధార్‌కార్డు ఒరిజినల్స్ తీసుకురావాలని సూచించారు. 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు కౌన్సెలింగ్ ఉంటుందని, రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాగుతుందన్నారు. 19న జీపీఏ 10 నుంచి 7 వరకు (ర్యాంకు 1 నుంచి 271 వరకు), 20న జీపీఏ 6.8 నుంచి 5 వరకు (ర్యాంకు 272 నుంచి 574), 21న జీపీఏ 4.8 నుంచి 0 వరకు (ర్యాంకు 575 నుంచి 897) కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 98667 82452 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల వ్యయ వివరాలు సమర్పించండి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేసిన అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయానికి సంబంధించి తుది వివరాలను సమర్పించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తాను చేసిన ఎన్నికల వ్యయానికి సంబంధించి తుది వివరాలను వ్యయ పరిశీలకులకు సమర్పించాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు ముగ్గురు పరిశీలకులు ఈనెల 25న వస్తారన్నారు. వారం రోజులు ఇక్కడే ఉండి ఎన్నికల ఖర్చును పరిశీలిస్తారని చెప్పారు. అభ్యర్థులందరూ తమ ఖాతాల పరిశీలన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, డీసీఓ అరుణకుమారి, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన కసాపురం



భక్తులతో కిటకిటలాడుతున్న కసాపురం ఆలయ ముఖమండపం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం భక్తులతో పోటెత్తింది. శనివారం వేకువజామునే స్వామివారికి అభిషేకాలు నిర్వహించిన అర్చకులు అనంతరం స్వర్ణ వజ్రకవచ అలంకరణలో స్వామి వారిని తీర్చిదిద్ది భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలిరావడంతో ఆలయం వద్ద క్యూలైన్లు కిటకిటలాడాయి.

22న హెచ్‌సీఎల్ టెక్‌బీ కెరీర్ ప్రోగ్రాంకు ఎంపిక

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్తంగా హెచ్‌సీఎల్ టెక్‌బీ కెరీర్ ప్రోగ్రాం ద్వారా ఈ నెల 22న ప్రభుత్వ ఐటీఐ (బాలుర) కళాశాల, అనంతపురంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు. 70 శాతం ఉత్తీర్ణత, మ్యాథ్స్ లేదా బిజినెస్ మ్యాథ్స్‌లో 60 కంటే ఎక్కువ శాతంతో ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. నాన్ ఐటీ రంగంలో 2023–2024లో 70 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణతతో ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా హెచ్‌సీఎల్ టెక్‌బీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇంటర్‌ను 2023–2024లో పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంపస్ డ్రైవ్‌కు రెజ్యూమ్ లేదా బయోడేటాతో పాటు ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, (పదో తరగతి, ఇంటర్), రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని రావాలన్నారు. వివరాలకు 6363095030, 8555085030 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

- ఏడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- హాజరుకానున్న 2,795 మంది అభ్యర్థులు

నేడు సివిల్స్ ప్రిలిమినరీ



ప్రశ్నపత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం జరగనుంది. ఏడు కేంద్రాల్లో సాగనున్న పరీక్షకు 2,795 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా పరీక్ష ఉంటుంది. పరీక్ష నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. కేంద్రానికి ఒకరు చొప్పున ఏడుగురు లైజనింగ్ అధికారులు, ఏడుగురు రూట్ అధికారులను నియమించారు. ప్రశ్నపత్రాలను జిల్లా ఖజానా కార్యాలయం నుంచి కేంద్రాలకు సాయుధ పోలీసు బందోబస్తు మధ్య తరలిస్తారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ప్రతి కేంద్రం వద్ద ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్, నలుగురు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రం ప్రవేశ ద్వారం వద్ద మెటల్ డిటెక్టర్‌తో తనిఖీ చేస్తారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి, సమాచారం అందించేందుకు, ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ (8500292992) ఏర్పాటు చేశారు.

అరగంట ముందే చేరుకోవాలి

పేపర్–1 ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, పేపర్–2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు జరుగుతుంది. అభ్యర్థులు నిర్దేశించిన పరీక్ష సమయం కంటే అరగంట (30 నిమిషాలు) ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఈ-అడ్మిట్ కార్డు ఉంటేనే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. దాంతో పాటు ఏదేని గుర్తింపు కార్డు చూపించాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రంలోకి అనుమతించరు.

ప్రశ్నపత్రాల స్ట్రాంగ్‌రూం పరిశీలన

ఖజానా శాఖ జిల్లా కార్యాలయంలో సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష పత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. అధికారులకు తగిన సూచనలు, ఆదేశాలిచ్చారు. ఆదివారం ఉదయం 6.30 గంటలకు రూట్ అధికారులు వచ్చి ఉదయం సెషన్‌కు సంబంధించి పేపర్–1 ప్రశ్నపత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలీసు బందోబస్తుతో పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లాలన్నారు. మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి పేపర్–2 ప్రశ్నపత్రాలను మధ్యాహ్నం 12.30 గంటలకు తీసుకువెళ్లాలన్నారు. అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, జిల్లా ఖజానా అధికారి సరళ విజయకుమారి, ఏటీఓ రాణి, నవీన్ ఉన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి


గాయపడిన రాము

గుంతకల్లు: పాత గుంతకల్లుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. పాత గుంతకల్లులోని 6వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్తలు అల్తాఫ్, శ్రీకాంత్ మరో ఇద్దరు కలిసి వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాముతో గొడవకు దిగారు. ఎన్నికల్లో తమ పార్టీకి సహకరించకుండా వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తావా..ఇప్పుడు నీ గతి ఏమీ అంటూ దుర్భాషలాడుతూ రాముపై రీపర్ కట్లతో దాడి చేసి గాయపరిచారు. వెంటనే సమీపంలోని వారు కలగజేసుకుని సర్ది చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయమై టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందిస్తున్న ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం: ఈ ఏడాది ఫిబ్రవరిలో మృతి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ కుటుంబానికి జిల్లా ఎస్పీ గౌతమి శాలి ఆర్థికసాయం అందించారు. శనివారం ఎస్పీ తన కార్యాలయంలో మృతుడి భార్య రాధకు కార్పస్ ఫండ్, విడో ఫండ్ కింద రూ.1.50 లక్షల విలువ చేసే చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతుడు నాగరాజు

చెన్నేకొత్తపల్లి: చింతచెట్టుపై నుంచి పడి గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ముష్టికోవెల గ్రామానికి చెందిన నాగరాజు(55) గత నెల 28న చింతచిగురు కోసం గ్రామ సమీపంలో ఉన్న చింత చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తూ జారి చెట్టు పై నుంచి కింద పడి తీవ్రగాయాల పాలయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

సందర్భం: నేడు ఫాదర్స్ డే

నువ్ గ్రేట్ నాన్నా!

- ఆప్యాయతల కలబోత
- మార్చేను తలరాత
- తను కరుగుతూ వెలుగునిచ్చే వ్యక్తి



''నాన్నా నువు నా ప్రాణం అనినా.. సరిపోదట ఆ మాట'' ఇటీవల విడుదలైన ఓ సినిమాలోని పాటలో చరణాలివి. కొవ్వొత్తిలా తాను కరుగుతూ ఇంటికి వెలుగునిచ్చే నాన్న గురించి చెప్పడానికి ఇంతకంటే మించిన మాటలు నిజంగా లేవేమో! బిడ్డలను లాలించి... లాలపోసి.. అడుగులేయించి.. అక్షరాలు పలికించి అన్నీ తానై తోడూ నీడగా ఉండే తండ్రి అనురాగానికి ఆప్యాయతలకు ప్రతీక. నాన్నతో గడిపిన క్షణాలు ప్రతి వ్యక్తి జీవితంలో మరచిపోలేని మధురానుభవాలు. అలా బిడ్డల జీవితాన్ని చేయి పట్టుకు నడిపించి ప్రయోజకులుగా తీర్చి దిద్దే తండ్రి ప్రాధాన్యతను గుర్తు చేసుకుంటూ గౌరవించడానికి ఓ ప్రత్యేక రోజును కేటాయించారు. ప్రతి ఏటా జూన్ మూడో ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా ఫాదర్స్ డేగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

– అనంతపురం/అనంతపురం కల్చరల్

తరాలు మారినా ఆయనే కీలకం..

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నడిచే రోజుల్లో తండ్రి అంటే అత్యంత భయభక్తులుండేవి. ఎదిరించి మాట్లాడడం కాదు కదా.. కావాల్సింది అడగడానికి కూడా జంకి తల్లి ద్వారా తమ కోర్కెలు తీర్చుకునే వారు. అయితే కాల చక్రంలో అనేక మార్పులొచ్చాయి. ఉమ్మడి కుటుంబాలు చెదిరిపోయాయి. బాధ్యతలు పెరిగాయి. కాలానుగుణంగా నాన్న పాత్ర కూడా మారిపోయింది. చిన్న కుటుంబాల్లో స్నేహితుడిగా మారిపోయాడు. పిల్లలను నిత్యం పాఠశాలకైనా, కళాశాలకైనా దిగబెట్టడానికి వెళ్తాడు. మళ్లీ సాయంత్రం తీసుకువస్తాడు. ఒకవైపు కుటుంబ పోషణకు రోజంతా కష్టపడుతూనే.. పిల్లలకు మార్గదర్శిగా ఉంటూ బిడ్డలకు అన్నీ తానై నడిపిస్తున్నాడు. పెళ్లై అత్తారింటికి వెళ్లినా, ఆడపిల్లకు తండ్రి లాలన పట్లే మక్కువ ఎక్కువ. ఉద్యోగాలొచ్చి ఎక్కడో స్థిరపడే మగపిల్లలను తండ్రి పంచిన క్రమశిక్షణే ముందుకు సాగేలా చేస్తుందనడంలో సందేహం లేదు. నాన్నంటే వెన్నంటి వచ్చే ఓ నీడ.. సర్వస్వం త్యాగం చేసే బాధ్యతకు ప్రతిరూపం అన్న భావాన్ని ఈ తరం పిల్లలు వ్యక్తం చేస్తున్నారు.

నాన్న లేకపోతే నేను లేను



మాది నెల్లూరు జిల్లా ఇందుకూరు పేట. నాన్న ఏ. నాగబ్రహ్మేంద్రరావు ప్రోత్సాహం లేనిదే నేను లేను. మేము 8 మంది సంతానం. ముగ్గురు అబ్బాయిలు. ఐదుగురు అమ్మాయిలం. వ్యవసాయాధారిత కుటుంబం. అందరినీ సమానంగా చూశారు. ఉన్నత చదువులకు మా అమ్మ సమ్మతించకున్నా, నాన్న వెళ్లమని ప్రోత్సహించారు. నాన్నకు చదువు అంటే చాలా ఇష్టం. మా కోసం చాలా త్యాగం చేశారు. అబ్బాయిలతో పాటు సమానంగా అమ్మాయిలను పెంచారు. ఆయన లేకుంటే నేను ఇంత వరకూ వచ్చేదాన్నే కాను. – ప్రొఫెసర్ కే. కృష్ణకుమారి, ప్రిన్సిపాల్, ఎస్కేయూ క్యాంపస్ కళాశాల

నాన్న ఆశయం నెరవేర్చా



మా నాన్న శంకర్ నగరంలో ఓ హోటల్ నడుపుతున్నారు. నన్ను పెద్ద క్లాసికల్ డ్యాన్సర్‌ను చేయాలనేది ఆయన కల. నా చిన్నప్పటి నుంచి అదే చెప్పేవారు. నాకు మా నాన్నంటే ఎంతో ఇష్టం. ఆయన కోసం అదే ఇష్టాన్ని శాస్త్రీయ నృత్యంపై పెట్టి మెలకువలు నేర్చుకున్నా. ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి నేతృత్వంలో జాతీయస్థాయితో పాటు దేశవిదేశాలలో అనేక ప్రదర్శనలిచ్చా. నేను డ్యాన్స్ చేస్తున్నప్పుడల్లా నాన్నే గుర్తొస్తారు. దీంతో కష్టమనేది అనిపించదు. పెళ్లి తర్వాత కూడా మా అత్తారింటి వారికి నాన్న ఆశయం నెరవేర్చాలని చెప్పా. వారు కూడా ఎంతో సహకరిస్తున్నారు. – మహాలక్ష్మి, శాస్త్రీయనృత్య కళాకారిణి, అనంతపురం

ఇప్పటికీ నాన్నే రోల్ మోడల్



మాది కర్నూలు జిల్లా పాణ్యం. నాన్న శామ్యూల్. అమ్మ పుల్లమ్మ, ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. మేం ముగ్గురం అక్కాచెల్లెళ్లం. అన్న టెలికాంలో డివిజన్ ఇంజినీర్. అందరినీ బాగా చదివించారు. చదువుతోనే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని ఎప్పుడూ చెప్పేవారు. ఇప్పుడు కూడా మా నాన్న పేరు చెబితేనే మా గుర్తింపు వచ్చేంత స్థాయికి ఎదిగారు. శామ్యూల్ సార్ కూతురు అంటే ఎంతగానో గౌరవిస్తారు. ఇప్పటికీ మా నాన్న రోల్ మోడల్. నేను బాగా చదువుతానని గుర్తించి బాగా ప్రోత్సహించారు. ఎమ్మెస్సీ గోల్డ్‌మెడల్ వచ్చినప్పుడు నాన్న ఎంతో ఆనందించారు.

– ప్రొఫెసర్ శోభాలత, మేథమేటిక్స్ విభాగాధిపతి, ఎస్కేయూ

వైఎస్సార్‌సీపీ ఓటమి తట్టుకోలేక మాజీ సర్పంచ్ మృతి


చిన్న కొండయ్య(ఫైల్)

పుట్లూరు: మండలంలోని అరకటివేముల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చిన్నకొండయ్య(68) వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. చిన్న కొండయ్య వైఎస్సార్‌సీపీ వీరాభిమాని. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందటంతో ఆయన తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో అస్వస్థతకు గురైన ఆయన శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య అంజనమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఐసీహెచ్-5 ఆముదంతో అధిక దిగుబడులు


రైతులకు విత్తన ఆముదం ప్యాకెట్లను అందజేసిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

కూడేరు: ఐసీహెచ్–5 రకం ఆముదంతో అధిక దిగుబడులు సాధించవచ్చని రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవ రెడ్డి అన్నారు. శనివారం పి.నారాయణపురం గ్రామానికి చెందిన రైతులకు బుక్కరాసముద్రం మండలం రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానంలో కొత్తరకం ఐసీహెచ్-5 విత్తన ఆముదం సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సహదేవ రెడ్డి మాట్లాడుతూ ఈ కొత్త రకం వర్షాభావానికి, అధిక వర్షాలకు తట్టుకొని దిగుబడిని అందిస్తుందన్నారు. పెట్టుబడి ఖర్చు కూడా తక్కువన్నారు. అనంతరం రైతులకు ఉచితంగా కొత్తరకం ఆముదం విత్తనాల ప్యాకెట్లను అందజేశారు. ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి, ఏఓ విజయ కుమార్, వీహెచ్ఏ ప్రమోద్, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిలాఫలకాల ధ్వంసం

రాయదుర్గం(డి హీరేహాళ్): జిల్లాలో శిలాఫలకాల విధ్వంసం కొనసాగుతోంది. శనివారం డి.హీరేహాళ్ మండలం నాగలాపురంలో టీడీపీ నాయకులు, సానుభూతిపరులు గ్రామ సచివాలయం, ఆర్‌బీకే ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేశారు. మాజీ సీఎం జగన్ చిత్రంతో ఉండే నవరత్న పథకాల ఫొటోలు, పార్టీ నాయకుల పేర్లతో ఉన్న శిలాఫలాకలను సుత్తితో నుజ్జునుజ్జు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చి పది రోజులకుపైగడిచినా ఇలాంటి విధ్వంసాలకు పాల్పడుతుండడం పట్ల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై దాడులను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో ఇది సరైంది కాదన్నారు.

నార్పల: గూగూడు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల శిలాఫలకాలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి సంఘటన స్థలంను పరిశీలించి నిందితులను వెంటనే గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.


గూగూడులో ధ్వంసమైన శిలాఫలకం

టీడీపీ 'తాగునీటి' రాజకీయం

- నరసనాయనికుంట ఎస్సీ, ఎస్టీ కాలనీలకు నీటి సరఫరా బంద్
- వాటర్‌ప్లాంట్ నుంచి నీళ్లు కొనుగోలు చేయాలంటూ సర్పంచ్ కుమారుడి హుకుం

సాక్షి టాస్క్‌ఫోర్స్: అధికారమే అండగా టీడీపీ నాయకులు గ్రామాల్లో రెచ్చిపోతున్నారు. చివరికి తాగునీటి విషయంలోనూ రాజకీయాలు చేస్తుండడం పట్ల పలువురు మండిపడుతున్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేరు చెప్పుకుంటూ అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంట గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలకు తాగునీరు రాకుండా అడ్డుకుంటున్నారు. కౌంటింగ్ ముగిసిన మరుసటి రోజు నుంచే ఈ చర్యలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే...గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుమారుడు శ్రీనివాసులు అనధికారికంగా వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకుని నీటి వ్యాపారం చేసుకుంటున్నాడు. ఎస్సీ, ఎస్టీ కాలనీల సమీపంలో గోవిందరెడ్డి అనే వ్యక్తి ఒక వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నాడు. ఎస్సీ, ఎస్టీ కాలనీల వాసులందరూ గోవిందరెడ్డి ప్లాంట్ నుంచే నీళ్లు తెచ్చుకునేవారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని అందరూ తమ వద్దే నీళ్లు కొనుగోలు చేయాలంటూ సర్పంచ్ కుమారుడు శ్రీనివాసులు హుకుం జారీ చేశాడు. ఇంతటితో ఆగకుండా ఎస్సీ, ఎస్టీ కాలనీలతో పాటు గోవిందరెడ్డి వాటర్‌ప్లాంట్‌కు వెళ్లే నీటిపైపులైన్లకు సర్పంచ్ కుమారుడు డమ్మీ కొట్టించాడు. ఎస్సీ, ఎస్టీ కాలనీలకు పంచాయతీ కార్యాలయం చాలా దూరం ఉంది. అంతదూరం వెళ్లి తాము నీళ్లు తెచ్చుకోలేమని ఆయా కాలనీల వాసులు వాపోతున్నారు. వారం రోజుల నుంచి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం

టీడీపీ గెలవగానే ఎస్సీ, ఎస్టీ కాలనీలకు సరఫరా అయ్యే నీటి పైపులైన్లకు డమ్మీలు కొట్టారు. దూరంగా ఉన్న పంచాయతీ కార్యాలయంలో ఉన్న వాటర్‌ప్లాంట్ వద్దకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు ఎస్సీ, ఎస్టీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్పందించి చర్యలు తీసుకోవాలి.

– వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు

బోర్‌వెల్ వాహన డ్రైవర్‌కు బెదిరింపులు

చేసేదిలేక గోవిందరెడ్డి తన సొంత భూమిలో 30 ఏళ్ల కింద వేయించుకున్న బోరును తవ్వించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో శనివారం బోర్‌వెల్ వాహనాన్ని రప్పించి ఆ బోరును శుభ్రం చేయించేందుకు సిద్ధమయ్యాడు. ఆ బోరు రెడీ అయితే ఎస్సీ, ఎస్టీలు తమ వద్దకు రారని భావించిన సర్పంచ్ కుమారుడు, మరికొందరితో కలిసి బోర్‌వెల్ వాహన డ్రైవర్‌ను బెదిరించారు. బోరు శుభ్రం చేస్తే మాత్రం ఎమ్మెల్యే పరిటాల సునీతతో చెప్పించి నీ వాహనాన్ని సీజ్ చేయిస్తామని హెచ్చరించడంతో సదరు వాహనం అక్కడి నుంచి వెళ్లిపోయింది. జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలోనే ఇంత ఘోర పరిస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు ఇప్పటిదాకా ఆవైపు కన్నెత్తి చూడలేదని పలువురు మహిళలు వాపోతున్నారు.

క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించాలి


బుక్‌లెట్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌ఓ

అనంతపురం మెడికల్: క్యాన్సర్‌ను ప్రారంభదశలోనే గుర్తించి మెరుగైన వైద్య సేవలందిస్తే..మంచి ఫలితాలుంటాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలకు శిక్షణా తరగతులను నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మహిళలు ప్రతి ఒక్కరూ స్వీయ రొమ్ము పరీక్ష చేయించుకోవాలన్నారు. దుర్వాసనతో కూడిన తెల్లబట్ట వంటి లక్షణాలున్నప్పుడు వెంటనే తగిన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా పురుషులు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. పొగాకు సేవించే వారికి నోటిలో ఏమైనా గాయాలు ఉంటే తక్షణం వైద్యులను సంప్రదించాలన్నారు. 30 ఏళ్లు పైబడిన ప్రతి మహిళ సర్వైకల్ స్క్రీనింగ్ పరీక్ష, 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ స్వీయ రొమ్ము పరీక్షపై అవగాహన కల్గి ఉండాలన్నారు. అనంతరం క్యాన్సర్ అవగాహన కల్పించే బుక్‌లెట్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పీఓడీటీ డాక్టర్ సుజాత, డీపీఎంఓ రవిశంకర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, జిల్లా క్యాన్సర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నిహారిక, శిక్షకులు డాక్టర్ ప్రమోద్, డాక్టర్ కుముదా, డాక్టర్ ఉదయభాను, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ మహేంద్రనాథ్, ఎన్‌సీడీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాళ్ల దాడిలో ఇద్దరికి తీవ్రగాయాలు

- బాధితులు వైఎస్సార్‌సీపీ నేతలు


గాయపడిన తిప్పేనాయక్


రాజగోపాల్ నాయక్

కూడేరు: ఉదిరిపికొండ తండాలో శనివారం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి మామ తిప్పేనాయక్, మరిది రాజగోపాల్‌నాయక్‌లపై భూవివాదంలో టీడీపీ నేతలు దాడి చేశారు. బాధితులు తెలిపిన వివరాలు.. తిప్పేనాయక్, రాజగోపాల్ నాయక్ శనివారం వారి పొలంలో కంది విత్తనం వేసేందుకు వెళ్లారు. అక్కడికి చేరుకున్న టీడీపీ నేతలు రవినాయక్, జయరాంనాయక్ ఉద్దేశ పూర్వకంగా భూమి తమదంటూ అడ్డొచ్చి గొడవకు దిగారు. కొన్నేళ్లు నుంచి ఈ భూమిని సాగు చేసుకుంటున్నామని బాధితులు చెబుతున్నా వినకుండా రాళ్లతో దాడి చేశారు. తలకు తీవ్రగాయాలు కావడంతో వారు అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

రాకెట్లలో సినిమా షూటింగ్ సందడి


సినిమా షూటింగ్‌లో పాల్గొన్న హీరో ఆదిపినిశెట్టి

ఉరవకొండ: రాకెట్ల గ్రామంలో హిట్ మ్యాన్ అండ్ ప్రోమోస్ ప్రొడక్షన్ సినిమా యూనిట్ శనివారం సందడి చేసింది. గ్రామంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పక్కన ఎంపిక చేసిన రైతు ఇంట్లో షూటింగ్ ప్రారంభమైంది. ప్రముఖ దర్శకుడు దేవా కట్టా దర్శకత్వంలో ఇంద్రప్రస్థ పేరుతో నిర్మిస్తున్న సినిమాలో ప్రముఖ నటుడు ఆదిపినిశెట్టి, చైతన్యకృష్ణ హీరోలుగా నటిస్తున్నారు. 1970, 1980లో జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈనెల 20 వరకూ ఆమిద్యాల, తగ్గుపర్తి, వెంకటాద్రిపల్లి గ్రామాల్లో షూటింగ్ జరుపుకోనుందని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి


మృతుడు ఉమాపతి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల మేరకు..పట్టణానికి చెందిన ఉమాపతి(64)కి మానసిక స్థితి సరిగాలేదు. ఈనేపథ్యంలో పట్టణంలోని వీధుల్లో తిరిగాడేవాడు. శనివారం ఉదయం టీ సర్కిల్ వద్ద అపస్మారక స్థితి ఉన్న అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తలకు రక్తగాయాలు ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ హరినాథ్ తెలిపారు.

శేఖన్నపై దాడి కేసులో ఐదుగురి అరెస్ట్

- నిందితులపై రౌడీషీట్
- డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి వెల్లడి


నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐ గణేష్

గుంతకల్లు: వైఎస్సార్‌సీపీ కార్యకర్త శేఖన్నపై దాడి కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో సీఐ పీ.గణేష్‌తో కలిసి వివరాలు వెల్లండించారు. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం దౌల్తాపురానికి చెందిన శేఖన్న రియల్ ఎస్టేట్ వ్యాపారి. కొంత కాలంగా గుత్తి మండలానికి చెందిన నల్లబోతుల ఓంప్రకాష్, రజాపురానికి చెందిన కావలి వెంకటేష్, కొత్తపేటకు చెందిన ఎం.రామాంజనేయులు,గుంతకల్లు మండలానికి చెందిన గూళ్యం గోవర్దన్, పుర్ల సురేందర్‌తో కలిసి వ్యాపారం చేస్తుండేవాడు. లావాదేవీల విషయంలో వీరి మధ్య గొడవలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం సాయికృష్ణ నర్సింగ్ హోమ్ వద్ద ఉన్న శేఖన్నపై ఈ ఐదుగురు దాడి చేసి పరారయ్యారు. వీరు మాస్కులు ధరించడంతో పోలీసులు గుర్తుతెలియని వ్యక్తులుగా కేసు నమోదు చేశారు. సాయికృష్ణ నర్సింగ్ హోమ్ సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితుల కోసం గాలించారు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం స్థానిక టీవీ టవర్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా నిందితులు పట్టుబడ్డారు. నిందితులను కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఐదుగిరిపై రౌడీ షీట్‌ను ఓపెన్ చేయడంతోపాటు రూ.లక్ష చొప్పున పూచీకత్తుతో బైండోవర్ చేస్తామన్నారు. ఇదిలా ఉండగా రాజకీయ కక్షతోనే దాడి జరిగినట్లు బాధితుడు తెలిపాడని విలేకరులు డీఎస్పీ దృష్టికి కెళ్లారు. స్పందించిన డీఎస్పీ ఇంకా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని, రిమాండ్ అనంతరం నిందితులను కస్టడీకి కోరాతామన్నారు.

గొర్రెల పెంపకందారుడి ఆత్మహత్య


మృతుడు ఓబులేసు

చెన్నేకొత్తపల్లి: అప్పుల బాధ తాళలేక గొర్రెల పెంపకందారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన న్యామద్దెల పంచాయతీ చిన్నంపేటలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన ఓబులేసు(35) అనే వ్యక్తి తెలిసిన వారి వద్ద అప్పు చేసి గొర్రెలను కొనుగోలు చేసుకొని పెంచుకునేవాడు. అయితే అనారోగ్యంతో చాలా గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈక్రమంలో అసలు, వడ్డీ కలిపి దాదాపు రూ.10 లక్షల వరకు అప్పు అయింది. రుణదాతలు అప్పు చెల్లించాలని ఓబులేసుపై ఒత్తిడి తెచ్చారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఇంటికి సమీపంలో ఉన్న గడ్డివామి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య శ్రీదేవితో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థులకు సమస్యలు తలెత్తనీయొద్దు



హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం రూరల్: వేసవి సెలవుల అనంతరం వసతి గృహాలు పునఃప్రారంభమైన తరుణంలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలోని గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయడంతో పాటు వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. వసతి గృహాల పరిసరాలు, గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. తాగునీటి, విద్యుత్ సమస్య తలెత్తనీయరాదన్నారు. హాస్టళ్ల పునఃప్రారంభంపై ప్రతి విద్యార్థికీ సమాచారం అందించాలన్నారు. వార్డెన్లు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామాంజినేయులు పాల్గొన్నారు.

22న 'సంధ్యారవళి'



కళాకారులతో సంధ్యామూర్తి

అనంతపురం కల్చరల్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 22న 'సంధ్యారవళి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి తెలిపారు. శనివారం కమలానగర్‌లోని శ్రీనృత్యకళానిలయంలో ఆమె మాట్లాడారు. సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతూ 12 గంటల పాటు నిర్విరామంగా శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకూ ప్రదర్శనలివ్వడానికి వివిధ రాష్ట్రాల నుంచి 300 మంది కళాకారులు విచ్చేస్తున్నారని తెలిపారు. అనంత ఖ్యాతిని ద్విగుణీకృతం చేస్తూ సాగే సంధ్యారవళిలో శాస్త్రీయ నృత్యంలోని వివిధ కళారూపాలను ప్రదర్శించే ప్రతి కళాకారున్ని సత్కరిస్తామని తెలిపారు. జిల్లా అధికారులు, సామాజిక సేవా ప్రతినిధులు ఆత్మీయ అతిథులుగా కార్యక్రమాలకు హాజరవుతారన్నారు. ఇప్పటికే వందలాది మంది కళాకారులు తర్ఫీదు పొందుతున్నట్లు పేర్కొన్నారు. కళాభిమానులు కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె కోరారు.

కేశవ రెడ్డికి డాక్టరేట్



బి. కేశవ రెడ్డి

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) ఇంగ్లిష్ విభాగంలో పరిశోధన చేసిన బోయలపల్లి కేశవరెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేశారు. వర్సిటీ హ్యూమానిటీస్ ప్రొఫెసర్, డైరెక్టర్ (ఉమెన్ ఎంపవర్‌మెంట్) ప్రొఫెసర్ వీబీ చిత్ర, ఎస్‌ఎస్‌బీఎన్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.గోపాల రెడ్డి పర్యవేక్షణలో 'ఎన్‌హ్యాన్సింగ్ స్టూడెంట్ టీచర్ ఇంటరాక్షన్ త్రూ టాస్క్ బేస్డ్ టీచింగ్ అమాంగ్ అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ ఆఫ్ సెలెక్ట్ డిగ్రీ కాలేజెస్ ఇన్ రాయలసీమ రీజియన్' అనే అంశంపై కేశవరెడ్డి పరిశోధన చేశారు. ఈయన ప్రస్తుతం కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

విత్తు ప్రారంభించిన అధికారులు



ట్రాక్టర్ గొర్రు ద్వారా విత్తనం విత్తుతున్న ఏడీఏ రవి, ఏఓ శశికళ

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ పంటల సాగు మొదలైంది. శనివారం అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లిలో వ్యవసాయశాఖ ఏడీ ఎం.రవి, ఏఓ శశికళ ట్రాక్టర్ ద్వారా వేరుశనగ విత్తనం వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులు వేరుశనగ, కంది, ఆముదం, పత్తి తదితర పంటల సాగు మొదలుపెట్టారు. గత పదిరోజులుగా వర్షాలు పడుతుండడంతో జిల్లా వ్యాప్తంగా మంచి పదును అయ్యింది. దీంతో పంటల సాగు జోరందుకునే వాతావరణం నెలకొంది.

అంగన్‌వాడీల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అనంతపురం సెంట్రల్: నగరంలోని పాతూరు బరమప్పవీధి, భీరప్పవీధుల్లో అంగన్‌వాడీ సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ కొనసాగింది. చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించి మానసిక వికాసానికి దోహదపడాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జయభారతి, మాధవి, లబ్ధిదారులు, చిన్నారులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- రేపు ఈదుల్ అజ్హా ప్రత్యేక నమాజ్

అనంతపురం కల్చరల్: ముస్లింల పర్వదినమైన బక్రీద్ (ఈదుల్ అజ్హా)ను త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. ముస్లింలకు ఏడాదిలో రెండు ప్రధాన పండుగలు. ఒకటి రంజాన్ కాగా మరొకటి బక్రీద్. నగరంలో ఈనెల 17న బక్రీద్ పండుగను ఘనంగా జరగనుంది.

బక్రీద్ పర్వదిన ప్రాధాన్యత ఇలా...

దైవ ప్రవక్త హజరత్ ఇబ్రహీం (సా)కు అల్లా పెట్టిన అగ్ని పరీక్షల్లో భాగంగా ఏకైక కుమారుడు ఇస్మాయిల్ అలైహివస్సలాం ఎనిమిదేళ్ల వయసులో ఉన్న బాలుడిని దేవుడి పేరిట త్యాగం చేయాలని ఆజ్ఞ వస్తుంది. ఇందులో భాగంగా అల్లా కలలో ఆదేశించిన సూచనల మేర అడవిలో ఏకాంత ప్రదేశంలో రాతిపై ఇబ్రహీం (సా) కుమారుడు ఇస్మాయిల్‌ను సమర్పించేందుకు తీసుకెళతారు. వెంట పదునైన కత్తి కూడా తీసుకెళ్తారు. బాలుడు తనను ఎక్కడకి తీసుకెళుతున్నారని చిలిపి మాటలతో తండ్రిని పలుమార్లు ప్రశిస్తున్నా సమాధానం ఇవ్వలేదు. చివరకు అల్లా ఆదేశించిన ప్రదేశానికి తీసుకెళ్తారు. అక్కడకు వెళ్లి రాతిపై పడుకోబెట్టిన తరువాత కుమారుడికి అనుమానం కలిగి తనను సమర్పించమని అల్లా ఏమైనా ఆదేశించాడా? అని ప్రశ్నిస్తాడు. దీనికి అవునని సమాధానం చెబుతారు. దీంతో ఆ బాలుడు నాన్నా.. నా మీద ఉన్న ప్రేమతో కత్తితో గొంతుపై కోయలేవు, నా మొహానికి బట్టకట్టి నాపై కత్తి కోయాలని చెప్పాడు. బాలుడు చెప్పిన మేరకు గొంతుపై అతని తండ్రి వెంట తెచ్చుకున్న కత్తితో బలంగా కోసినప్పటికీ తెగలేదు. దీంతో బాలుడి తండ్రి కోపంతో రాతి గుండుపైకి కత్తిని విసరగా, ఆ పదునుకు రాయి రెండు ముక్కలవుతుంది. దీంతో అల్లా దేవదూత అయిన జిబ్రయిల్ (సా) అక్కడికి వచ్చి అల్లా పెట్టిన అగ్ని పరీక్షల్లో నెగ్గావు.. నీ కుమారుడి బదులు స్వర్గం నుంచి అల్లా స్వయంగా పెంచిన బలమైన పొట్టేలును వెంట తెచ్చాను. దీన్ని జువా చేయాలని ఆదేశిస్తారు. దీంతో అప్పటి ప్రవక్త ఇబ్రహీం(సా) పొట్టేళ్లను జువా చేశారు. నాటి నుంచి నేటి వరకు అలాగే ప్రళయ దినం రోజు దాకా బక్రీద్ పండుగ రోజున ఆర్థిక స్థోమత గలిగిన ప్రతి ఒక్కరూ పొట్టేళ్లను జువా చేసి తండ్రి, కుమారుల త్యాగాన్ని స్మరించుకోవాలని హదీస్, ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ చెప్తోంది.

బక్రీద్ వేడుకలకు ఏర్పాట్లు

బక్రీదు పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మేయర్ వసీం అన్నారు. ఆయన శనివారం నగరంలోని హౌసింగుబోర్డు ఈద్గా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వారం రోజులుగా బక్రీదు ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మైదానంలో పారిశుధ్య నిర్వహణ, నీటి సౌకర్యం, నమాజ్‌కు అవసరమైన వసతులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, అబూసాలెహ, ఇషాక్, రహంతుల్లా, కో ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు ఉన్నారు.




ఈద్గా మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ వసీం

మత సామరస్యంతో బక్రీద్ జరుపుకోవాలి

అనంతపురం కార్పొరేషన్: మత సామరస్యంతో బక్రీద్ పండుగ జరుపుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ సూచించారు. ఆయన శనివారం తన చాంబరులో అధికారులతో సమావేశమయ్యారు. ప్రార్థనల కోసం ఈద్గాలను శుభ్రంగా ఉంచి..తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి జి.రామసుబ్బారెడ్డి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వై.సుబ్రమణ్యం, డీఎస్పీ ప్రతాప్ కుమార్, పీటీడీటీ డాక్టర్ సుజాత, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు

రాప్తాడు: ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి తెలిపారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి అనంతపురం రూరల్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో అక్కడక్కడా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాల శిలా ఫలకాలను ధ్వంసం చేస్తున్నారని, ఇది మంచి పరిణామం కాదని అన్నారు. ఈ భవనాలన్నీ ప్రభుత్వ ఆస్తులని, వీటిని ధ్వంసం చేయరాదని చెప్పారు. అదేవిధంగా ప్రైవేటు ఆస్తులు, విగ్రహాల జోలికి కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లరాదన్నారు. దాడులు.. ప్రతిదాడులు చేసుకోవడం వంటి దుశ్చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఎవ్వరూ రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రజలు స్వచ్ఛందంగా డయల్ 100కు గానీ, పోలీసులకు గానీ ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. పోలీసుల ఆంక్షలు దాటితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

కక్షలకు ఆజ్యం పోస్తే 'సస్పెక్ట్ షీట్'

- అనంతపురం రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న సీఐ రామకృష్ణారెడ్డి

రాప్తాడురూరల్: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కక్షలకు ఆజ్యం పోస్తూ శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. శనివారం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ తర్వాత కొందరు గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, పాలవెల్లువ కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఉండే శిలాఫలకాలను ధ్వంసం చేస్తూ భయోత్పాతం సృష్టిస్తున్నారన్నారు. కొన్నిచోట్ల రాజకీయ నాయకుల విగ్రహాలను పగలకొట్టడం లాంటి చర్యలకు కూడా పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి ఘటనలపై పోలీసు శాఖ చాలా సీరియస్‌గా ఉందన్నారు. నిందితులపై కేసుల నమోదుతో పాటు సస్పెక్ట్‌షీట్లు తెరవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఒక్కసారి సస్పెక్ట్ షీట్ నమోదైతే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసేవారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై జులుం ప్రదర్శిస్తూ..వారి విధులకు ఆటంకం కలిగించినా తీవ్ర చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో కక్షలకు దూరంగా ఉంటూ అందరూ ప్రశాంతంగా, కలిసిమెలసి జీవనం సాగించాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ సిబ్బందికి మెమో

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు: విధులకు డుమ్మా కొట్టిన హంపాపురం అంగన్‌వాడీ కేంద్రం ఆయా భాగ్యమ్మ, రికార్డులు సరిగా నిర్వహించని కార్యకర్త శివలక్ష్మికి సీడీపీఓ ధనలక్ష్మి మెమో జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం హంపాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని సూపర్‌వైజర్ హేమలతతో కలిసిన ఈడీపీఓ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త బాలగొండ శివలక్ష్మి ఈ నెల 12 నుంచి మూడు రోజులపాటు సెలవు పెట్టడంతో కేంద్రం నిర్వహణను ఆయా భాగ్యమ్మకు సూపర్‌వైజర్ అప్పగించారు. అయితే సూపర్‌వైజర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆయా అంగన్‌వాడీ కేంద్రం తెరవలేదు. దీనిపై 'అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అలసత్వం' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆదేశాల మేరకు సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ హేమలత శనివారం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి.. రికార్డులు పరిశీలించారు. ఆయా విధులకు రాక పోగా.. ఫోన్ చేసినా స్పందించలేదు. ఆయా తన విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని పలువురు చిన్నారుల తల్లులు ఆరోపించారు. ఇదివరకే ఆయాకు ఎనిమిదిసార్లు మెమోలు ఇచ్చినా పనితీరులో మార్పు రాలేదని సీడీపీఓ పేర్కొన్నారు. తాజాగా ఆయాకు మెమోతో పాటు జీతంలో కోత విధిస్తున్నామని స్పష్టం చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని అంగన్‌వాడీ కార్యకర్త శివలక్ష్మికి కూడా మెమో జారీ చేసినట్లు వెల్లడించారు.



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ ధనలక్ష్మి

సద్గురువుల బాటలోనే సమున్నత జీవితం



వలీస్వామి సమాధి వద్ద శ్రీగంధ పూజలు నిర్వహించిన భక్తులు



అనుగ్రహ భాషణం చేస్తున్న స్వామి విద్యానృసింహ భారతీ

అనంతపురం కల్చరల్: సద్గురువుల బాటలోనే సమున్నత జీవితం ప్రాప్తిస్తుందని దత్త పీఠాధిపతులు విద్యానృసింహభారతీ స్వామీజీ అన్నారు. శనివారం స్థానిక హెచ్చెల్సీకాలనీలోని శ్రీ అక్కల్‌కోట మహారాజ్ సేవా సమాజ్ ఆశ్రమంలో వలీస్వామి ఆరాధన ఉత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యానృసింహభారతీ స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. వలీస్వామితో భక్తులకు అనేక అనుభవాలున్నాయని, వారందరూ గొప్ప గురువును పొంది ధన్యులయ్యారన్నారు. సాక్షాత్తు అవధూత స్వరూపులుగా వలీస్వామి ఎన్నో లీలలను ప్రదర్శించి అనంత వాసులను భక్తిమార్గంలో నడిపించారని కొనియాడారు. అంతకు ముందు ఆశ్రమ నిర్వాహకులు విజయ్‌కుమార్ నేతృత్వంలో వలీస్వామి ఆశ్రమంలో పెద్ద ఎత్తున పూజలు, సామూహిక భజనలు, వివిధ దేవతామూర్తులకు అభిషేకాలు, అన్నప్రసాద వితరణ జరిగాయి. వలీస్వామి సమాధి వద్ద శ్రీగంధ పూజలు నిర్వహించారు.

కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు జయచంద్రారెడ్డి, చలపతిరెడ్డి, శ్రీధర్, కుముదమ్మ, ఏజీ ప్రమీళమ్మ, విజయ్‌కుమార్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీతో 'అనంత' అనుబంధం

అనంతపురం కల్చరల్: తెలుగు కవిత్వాన్ని అంతర్జాతీయ బాట పట్టించిన శ్రీశ్రీకి జిల్లాతో అనుబంధం ఉండడం గర్వకారణమని పలువురు వక్తలన్నారు. శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో శనివారం స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రాంగణంలో పలువురు కవులు, రచయితలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టజీవికి అటు ఇటు ఉండేవాడు నిజమైన కవి అని కవిత్వానికి కొత్త నిర్వచనం చెప్పిన మహాకవి శ్రీశ్రీ అన్నారు. తెలుగు సాహిత్యపు సువాసనలకు నోచుకోని ఎందరో అభాగ్యుల జీవితాలు శ్రీశ్రీ కవిత్వంలో పతాక శీర్షికన నిలిచాయన్నారు. విప్లవ రచయిత సంఘం ఆహ్వానం మేరకు ఆయన అనంతకు రావడం, అనేక చర్చాగోష్ఠులలో పాల్గొనడం మన అదృష్టమన్నారు. 1971 నవంబర్‌లో స్థానిక లలితకళాపరిషత్‌కు, 1974లో కదిరి ప్రాంతానికి విచ్చేశారన్నారు. 1975 జనవరిలో ఏకంగా మూడు రోజులపాటు అనంతలో గడిపారని గుర్తు చేసుకున్నారు. పతితులకు, భ్రష్టులకు, బాధాదర్పదష్టులకు అండగా నిలవడం వల్ల శ్రీశ్రీ చిరస్థాయిగా మిగిలిపోయాడని అభిప్రాయపడ్డారు. మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, అనంతం వంటి కావ్యాలలో పెల్లుబికిన అపూర్వభావి విప్లవం, ఆయన రాసిన ప్రతి గేయం తెలుగువాడి గుండెల్లో ప్రతిధ్వనిస్తుందన్నారు. కార్యక్రమంలో సాహిత్యపీఠం నిర్వాహకులు నాగలింగయ్య, కవులు అశ్వర్థరెడ్డి, నాగేంద్ర, ఈరన్న, హరీష్, ప్రవీణ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా రచయితలు

రోగులకు మెరుగైన సేవలందించాలి

- ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రికొచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆదేశించారు. శనివారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిని వారు ఆకస్మిక తనిఖీ చేశారు. మొదట కాన్పుల వార్డులో పర్యటించి బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో అడ్మిషన్లు, ఓపీ సేవలు ఏవిధంగా ఉన్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావుతో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అందరూ సమష్టిగా పని చేసి జీజీహెచ్‌ను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలన్నారు. మౌలిక సదుపాయాలకు సంబంధించి నివేదికను సిద్ధం చేసి అందజేయాలన్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణంలో పలు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మదమంచి స్వరూప, ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, హెచ్‌ఓడీలు డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ వైఎంఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అంజన్నకు ప్రత్యేక పూజలు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి ఆలయంలో అంజన్నకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య అంజన్నకు పూజలు చేశారు. ఉదయం ఆరు గంటలకు స్వామి బావి నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి ప్రత్యేకంగా అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ చేశారు.

మారని సచివాలయ సిబ్బంది తీరు

రాప్తాడు: హంపాపురం గ్రామ సచివాలయ సిబ్బంది పని తీరులో ఏమాత్రం మార్పు రాలేదు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తూనే ఉన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ గీతాంజలి ఒక్కరే విధుల్లో కనిపించారు. మిగిలిన సిబ్బంది ఎక్కడని ప్రశ్నించగా, క్యాంపుపై వెళ్లారని సమాధానమిచ్చారు. ఆ తర్వాత కొద్దిసేపటికే మహిళా పోలీసు, వీఆర్వో ఆగమేఘాల మీద వచ్చి అటెండెన్స్‌లో సంతకం చేశారు. ఇక మిగతా సిబ్బంది అయితే నాలుగైదు రోజులుగా అటెండెన్స్‌లో సంతకాలే చేయలేదు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

నెల్లూరు, చిత్తూరు జట్ల విజయం

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-23 సౌత్ జోన్ టోర్నీలో భాగంగా నిర్వహిస్తున్న మ్యాచ్‌ల్లో శనివారం నెల్లూరు, చిత్తూరు జిల్లాల జట్లు విజయం సాధించాయి.

- కర్నూలు- నెల్లూరు జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి కర్నూలు బ్యాటింగ్ ఎంచుకుంది. 27.3 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో నయిముల్లా 51 బంతుల్లో 50 పరుగులు (7 ఫోర్లు, ఒక సిక్సర్), ఇస్మాయిల్ 19 బంతుల్లో 21 పరుగుల(3 ఫోర్లు, ఒక సిక్సర్)లతో సత్తాచాటారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 23.5 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 125 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. రేవంత్ రెడ్డి 56 బంతుల్లో 53 పరుగులు, నిఖిలేశ్వర రెడ్డి 82 బంతుల్లో 56 పరుగులు సాధించడంతో 9 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు గెలుపొందింది.
- చిత్తూరు- కడప జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కడప టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంపిక చేసుకుంది. 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 220 పరుగులు సాధించింది. ఎం. వాసుదేవ రాజు 89 బంతుల్లో 50 పరుగులు , విజయరామిరెడ్డి 75 బంతుల్లో 66 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 40.1 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 223 పరుగులు చేసి గెలుపొందింది. ధరణి కుమార్ 68 బంతుల్లో 57 పరుగులు, రెడ్డి రుషిల్ 86 బంతుల్లో 104 పరుగులు దాటిగా ఆడి జట్టు విజయానికి కృషి చేశారు.

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోవాలి



ముస్లింలతో మాట్లాడుతున్న సీఐ నరేంద్రరెడ్డి

ఆత్మకూరు: సార్వత్రిక ఎన్నికలు ముగిశాయని, ఇకపై ప్రతి ఒక్కరూ కలసిమెలసి ఉండాలని, ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ నరేంద్రరెడ్డి సూచించారు. శనివారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో మండలంలోని ముస్లింలతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

'నారాయణ'లో ఫీజుల దోపిడీ అరికట్టాలి

- విద్యార్థి సంఘాల ధర్నా



పుస్తకాల గదిని సీజ్ చేసిన దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నారాయణ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని నారాయణ కళాశాల వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.వీరేంద్ర ప్రసాద్, 'ఐసా' రాష్ట్ర అధ్యక్షుడు వేమన, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్ర, పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి బందారు శంకర్ మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల్లో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పుస్తకాలను కూడా వేల రూపాయలకు అమ్ముతున్నారన్నారు. ఈ విషయాన్ని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. కళాశాల గదిలో పాఠ్య పుస్తకాలను విక్రయిస్తుండగా.. ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి (ఆర్‌ఐఓ)ని పిలిపించి సీజ్ చేయించారు.

ఎస్పీబీకి స్వర నీరాజనం



ఎస్పీబీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: గానగాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికి గాయనీ గాయకులు స్వరనీరాజనమర్పించారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం 78వ జయంతిని చంద్ర సినీ ఆర్కెస్ట్రా వారు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక లలితకళాపరిషత్తులో జరిగిన సంగీత విభావరిలో మొదట ఎల్కేపీ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి పద్మజ, సీనియర్ నటుడు సోమిరెడ్డి, ఆచార్య సుధాకరబాబు, నిర్వాహకులు తలారి శ్రీనివాసులు, అస్లాంబాషాలు ఎస్పీబీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ప్రముఖ సినీగాయనీ గాయకులతో మధుర గీతాల ఆలాపన, గానగాంధర్వుడికి సంగీత శ్రద్ధాంజలి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఎస్పీ బాలు సినీరంగానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.